

నార్ల తాతారావుకు శ్రద్ధాంజలి ఘటిస్తున్న పద్మనాభరావు, నార్ల గోపి, పద్మ సుజాత

# విద్యుత్తు రంగంలో ధ్రువతార 'నార్ల'

**ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే:** విద్యుత్తు రంగంలో ధ్రువతార ప్రముఖ ఇంజినీరు నార్ల తాతారావు అని మంత్రి దేవినేని ఉమా అన్నారు. నార్ల తాతారావు శత జయంతి వేడుకలను సోమవారం ఎన్టీటీపీఎస్‌లో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యుత్తు ఉత్పాదన రంగంలో విశేష సేవలు అందించిన నార్ల నేటి ఇంజినీర్లకు ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. నేటి ఎన్టీటీపీఎస్ ఇక్కడికి రావడానికి ఆయన చేసిన కృషి మరువలేనిదన్నారు. అనుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు పట్టుదలతో ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగేవారని వివరించారు. రైతులకు ఉచిత విద్యుత్తు ఇవ్వాలన్న డిమాండ్‌ను తీసుకువచ్చిన వ్యక్తి తాతారావేనని మంత్రి గుర్తు చేశారు. అనంతరం ఏపీ జెన్‌కో అధ్యక్షుడు, కార్యనిర్వాహక సంచాలకుడు కె.విజయానంద్ ప్రసంగిస్తూ జల, థర్మల్ విద్యుత్తు రంగాల్లో ఆయన పలు మార్పులు తీసుకువచ్చారన్నారు. ఇంజినీర్‌గా భావితరాల అవసరాలను ఆయన ఆనాడే గుర్తించారని అన్నారు. సీఈ పద్మసుజాత



ప్రసంగిస్తున్న మంత్రి ఉమామహేశ్వరరావు

మాట్లాడుతూ ప్రతి ఇంజినీర్ ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. స్థానిక ప్రముఖుడు మల్లెల పద్మనాభరావు తాతారావుతో తనకున్న అనుబంధాన్ని నెమరు వేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ జెన్‌కో సీఎండీ ప్రభాకరరావు, అధికారులు బలరామరెడ్డి, సుందర్‌సింగ్, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు ఎన్టీటీపీఎస్‌లోని నార్ల తాతారావు కాంస్య విగ్రహానికి ఎన్టీటీపీఎస్ చీఫ్ ఇంజినీర్ పద్మ సుజాత, మల్లెల పద్మనాభరావు, నార్ల గోపి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టెలిఫిలిం ద్వారా నార్ల జీవిత ముఖ్య అంశాలను వివరించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు పెద్ద సంఖ్య పాల్గొన్నారు.

**సంస్కరణల కర్త తాతారావు:** కృష్ణా జిల్లా వాసి అయిన తాతారావు విద్యుత్తు రంగానికి ఎనలేని సేవ చేశారు. బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ పట్టా పొందిన ఆయన మధ్యప్రదేశ్ ఎలక్ట్రిసిటీ బోర్డులో ఉద్యోగ ప్రస్థానాన్ని ప్రారంభించారు. 1974లో రాష్ట్ర ఎలక్ట్రిసిటీ బోర్డు ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. 14 సంవత్సరాల పాటు సేవలందించారు. కృష్ణా జిల్లాలో థర్మల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్న లక్ష్యంతో వివిధ ప్రాంతాల్లో సర్వే చేశారు. ఇబ్రహీంపట్నం అనువుగా ఉంటుందని కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఆనాడు జిల్లాయేతరులు ఈ ప్రాజెక్టు కోసం తీవ్ర ప్రయత్నాలు చేశారు. అయితే కృష్ణా నది నుంచి వ్యయం లేకుండా థర్మల్ కేంద్రానికి అవసరమైన నీటిని తీసుకోవచ్చుని వివరిస్తూ భవానీపురం నుంచి ఎన్టీటీపీఎస్ వరకు గ్రావిటీ ద్వారా నీరు వచ్చేలా ఓపెన్ కెనాల్ సిస్టంను రూపకల్పన చేశారు. దాని వలన నిర్మాణ వ్యయం గణనీయంగా తగ్గుతుందని ఆనాటి కేంద్ర నాయకులకు వివరించి, అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఈ ప్రాజెక్టుకు ఒప్పుకునేలా చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 1983లో పద్మశ్రీ, 1995లో ఎనర్జీ మ్యాన్ ఆఫ్ ది ఇయర్ అవార్డులు ఇచ్చి గౌరవించింది. ఆయన కాలం చేసిన తరువాత 2007లో విజయవాడ థర్మల్ విద్యుత్తు కేంద్రం పేరును డాక్టర్ నార్ల తాతారావు థర్మల్ విద్యుత్తు కేంద్రంగా మార్పు చేశారు. కాంస్య విగ్రహాన్ని ఎన్టీటీపీఎస్‌లో ఏర్పాటు చేసి నిత్యం అతని సేవలను గుర్తు చేసుకుంటున్నారు.

# నార్ల స్ఫూర్తితోనే విద్యుత్ వెలుగులు

- ఘనంగా పద్మశ్రీ డాక్టర్ నార్ల తాతారావు శత జయంతి
- మంత్రి దేవినేని ఉమా

**ఎన్టీటీపీఎస్(ఇబ్రహీంపట్నం):** డాక్టర్ నార్ల తాతారావు స్ఫూర్తితో విద్యుత్ రంగంలో అగ్రగ్రామిగా వెలుగొందుదామని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. పద్మశ్రీ డాక్టర్ నార్ల తాతారావు శత జయంతి వేడుకలు సోమవారం ఏపీ జెన్‌కో ఆధ్వర్యంలో ఎన్టీటీపీఎస్ అధికారులు ఎస్‌వీసీటీ కళ్యాణమండపంలో ఘనంగా నిర్వహించారు. నార్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎన్టీటీపీఎస్ సీఈ ఎం.పద్మసుజాత అధ్యక్షతన జరిగిన సభలో మంత్రి దేవినేని మాట్లాడుతూ విద్యుత్ రంగంలో స్వదేశీ పరిజ్ఞానం ప్రవేశపెట్టి రాష్ట్రంలో పలు విద్యుత్ ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన చొరవ నేటి యువ ఇంజనీర్లకు ఆదర్శనీయమన్నారు. ఏపీఎస్ఈబీ ఛైర్మెన్ బాధ్యతలు తీసుకునే సమయంలో కేవలం 470 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి ఉండేదని ఆయన పదవి విరమణ సమయం వచ్చేనాటికి దానిని 5వేల మెగావాట్లకు తీసుకువెళ్లడం చూస్తుంటే వృత్తి పట్ల ఆయనకి ఉన్న దీక్షను తెలియజేస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంజనీరింగ్ పూర్తి చేసిన వారిని పోత్సహించి విజయ ఎలక్ట్రికల్స్ ఎండీ జై రమేష్ లాంటి వారిని పారిశ్రామిక వేత్తలుగా మారేందుకు దోహదపడ్డారని అన్నారు. ఆయన గోప్పతనాన్ని, సాధించిన అవార్డుల గురించి భవిష్యత్ తరాలకు చెప్పాల్సిన బాధ్యత నేటి ఇంజనీర్లపై ఉందన్నారు. ముఖ్యంమంత్రి చంద్రబాబు నాయుడు సంస్కరణలు కారణంగానే నేడు 30వేల మెగావాట్ల ఉత్పత్తికి కారణమైందన్నారు. తెలంగాణా విద్యుత్ ఛైర్మెన్ ప్రభాకరరావు మాట్లాడుతూ విద్యుత్‌రంగంలో నార్ల తాతారావు సేవలు నిరుపవమానమైనవని అన్నారు. రాష్ట్ర విభజన జరిగిన తరువాత 1250 మంది ఉద్యోగుల సమస్యతో పాటు ఆస్తుల విభజనకు చోరవ తీసుకుంటామని ఏపీ ప్రభుత్వం కూడ సహకారం అందించే విధంగా ముందుకు రావాలని కోరారు. ఏపీ జెన్‌కో ఎండీ విజయనంద్ మాట్లాడుతూ నాణ్యమైన విద్యుత్ అందించటమే నార్లకు మనము ఇచ్చే ఘన నివాళులన్నారు. ఆయన స్ఫూర్తితో మరింతగా ముందుకు సాగుదామని అన్నారు. విజయా ఎలక్ట్రికల్స్ ఎండీ జై రమేష్ మాట్లాడుతూ డాక్టర్ నార్ల తాతారావు విజన్ ఎంతో గొప్పదని అన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ముఖ్య ఇంజనీర్ బలరామిరెడ్డి, నార్ల తాతారావు కుమారుడు నార్ల గంగాధర్, ఆయన కుమార్తె యడ్లపల్లి జానకి, ఆయన మనమలు మనవరాళ్లు, ఏపీ జెన్‌కో డైరెక్టర్లు అప్పారావు, సుందర్‌సింగ్, ట్రాన్స్‌కో ఛైర్మెన్ నాయక్, మల్లెల అంనత పద్మనాభరావు, జంపాల సీతారామయ్య పాల్గొన్నారు.



డాక్టర్ నార్ల తాతారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మంత్రి దేవినేని, ఏపీ జెన్‌కో ఎండీ విజయానంద్, నార్ల తాతారావు కుమారుడు నార్ల గంగాధర్, కుమార్తె యడ్లపల్లి జానకి, ఎన్టీటీపీఎస్ సీఈ ఎం.పద్మసుజాత, ట్రాన్స్‌కో సీఎండీ నాయక్

# వెలుగుల తాత కథ!

**మారుమూల గ్రామంలో ఆలయ దీపాల వెలుగులో చదువుకున్న సాదాసీదా వ్యక్తి! అనతికాలంలోనే భారతదేశమంతటా వెలుగుబాటలు పరిచాడు. ఆయనే నార్ల తాతారావు.**



కృష్ణాజిల్లా కౌతారం గ్రామంలో 1917 సెప్టెంబరు 4న నార్ల తాతారావు జన్మించారు. అంటే.. నేడు ఆయన శత జయంతి. కౌతారంలో ఐదో తరగతి, మచిలీపట్నంలో ప్లస్ 2 వరకు.. గుంటూరులో ఫిజిక్స్‌లో గ్రాడ్యుయేషన్. బెనారస్ ఇంజనీరింగ్ కాలేజీలో చదువు పూర్తి చేసుకొని...జంషెడ్‌పూర్‌లో ఉద్యోగంలో చేరారు. 1940 దశకంలో ఇల్లినాయిస్‌లో ఇంజనీరింగ్‌లో ఎంఎస్ పూర్తిచేసి.. భారత్‌కు తిరిగివచ్చారు. మధ్యప్రదేశ్‌లో డివిజన్ ఇంజనీర్‌గా ప్రస్థానం ప్రారంభించారు. అధికారిగా స్వయంగా రిస్క్ తీసుకుని అప్పటి మధ్యప్రదేశ్ పరిధిలోని బస్తర్‌కు వెళ్లారు. కీకారణ్యాన్ని తలపించే అత్యంత వెనుకబడిన ప్రాంతమైన బస్తర్‌లో ఇపుడు విద్యుత్ వెలుగులు కనిపిస్తున్నాయంటే అది ఆయన చలవే! మధ్యప్రదేశ్ ప్రభుత్వం..తాతారావుని విద్యుత్ బోర్డు వైస్ చైర్మన్‌ని చేసింది. 1972లో కేంద్రం జాతీయ జల, విద్యుత్ కమిషన్ సభ్యునిగా నియమించింది. ఓ తెలుగువాడు ఎక్కడికో వెళ్లి రాణిస్తుంటే.. మనమెందుకు ఆయన సేవలను ఉపయోగించుకూడదనుకున్న అప్పటి ఆంధ్రప్రదేశ్ సీఎం జలగం వెంగళరావు, 1974లో ఆయనను రాష్ట్రానికి రప్పించారు. విద్యుత్ బోర్డు తొలి చీఫ్‌గా.. వరుసగా






14 ఏళ్లపాటు ఆయన సేవలందించారు. విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని ఐదు రెట్లు పెంచారు. విజయవాడలో థర్మల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు ఆలోచన ఆయనదే. దీనికి గుర్తుగా ఈ ప్లాంటుకు తాతారావు పేరే పెట్టారు. నాగార్జున సాగర్, శ్రీశైలం, దిగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టుల లోనూ అమోఘమైన సేవలు అందించారు. కొత్తగూడెం థర్మల్ విస్తరణ ఆయన ముందుచూపు ఫలితమే. కుప్పకూలిన తమ విద్యుత్ వ్యవస్థను బతికించడానికి బంగ్లాదేశ్ ప్రభుత్వం ఆయన్ను ప్రత్యేకంగా పిలిపించుకొంది. తాతారావు 1983లో పద్మశ్రీ, 1995లో ఎనర్జీ మ్యాన్ ఆఫ్ ద ఇయర్‌గా అవార్డు అందుకున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు, సంస్థలు అందించిన అవార్డులు, రివార్డులకు లెక్కేలేదు. తన 90వ యేట 2007 ఏప్రిల్ 7న కాలధర్మం చేసిన తాతారావు చూపిన 'వెలుగు' బాట తెలుగువారందరికీ అనుసరణీయం!

> "నేనెప్పుడూ ఉద్యోగాన్ని అడగలేదు. ఉద్యోగమే నన్ను అడిగింది"
>
> -నార్ల తాతారావు

- అమరావతి, ఆంధ్రజ్యోతి

బుధవారం 6 సెప్టెంబరు 2017

# ఘనంగా పాఠశాల 72వ వార్షికోత్సవం



దామోదరయ్య విగ్రహానికి నివాళులర్పిస్తున్న విద్యావేత్తలు తదితరులు

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** విద్యాసంస్థల మనుగడ తల్లిదండ్రులపైనే ఆధారపడి ఉంటుందని జిల్లా పాలసమితి డైరెక్టర్ వల్లభనేని బాబురావు అన్నారు. మంగళవారం మండలంలోని కౌతవరం జడ్పీ ఉన్నత పాఠశాల 72వ వార్షికోత్సవం, వ్యవస్థాపకులు కానూరి దామోదరయ్య 72వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకితభావంతో పిల్లలకు చదువు చెప్పాలని కోరారు. అనంతరం విద్యా, సాంస్కృతిక, క్రీడా పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు దాతల సహకారంతో ₹ 60 వేల నగదు అందజేశారు. పదో తరగతిలో ప్రతిభ చూపిన ద్వారకకు ₹27 వేల నగదు ఇచ్చారు. అంతకుముందు వ్యవస్థాపకులు కానూరి దామోదరయ్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. హెచ్‌ఎం విజయకుమారి సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచి పడమట సుజాత, ఎంపీటీసీ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు.

శనివారం 9 సెప్టెంబరు 2017

# వేడుకగా జలసిరికి హారతి

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** స్థానిక కొత్త వంతెన పక్కన పుల్లేరులో శుక్రవారం జలసిరికి హారతి కార్యక్రమం నిర్వహించారు. ఇరిగేషన్‌శాఖ ఆధ్వర్యంలో ఎస్‌ఈ నరసింహమూర్తి, ఈఈ మోహన్‌రావు, డీఈఈ కొడాలి బాబు, ఏఈఈలు రాజ్యలక్ష్మి, సిద్ధార్థ, సూర్యభరత్, సత్యనారాయణ, లాకుసూరింటెండెంట్ ఉదయభాస్కర్ తదితరుల పర్యవేక్షణలో పుల్లేరులో జడ్పీ ఉపాధ్యక్షురాలు శాయన పుష్పావతి తదితరులు పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం వంతెనపై నుంచి ప్రదర్శనగా కౌతవరం ఇరిగేషన్ సబ్‌డివిజన్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సభకు తరలివచ్చారు. అయితే వర్షం కురవడంతో సభ నిలిచిపోయింది. ఎంపీపీ విజయభారతి, అర్బన్‌బ్యాంక్ ఛైర్మన్ బాబ్జి, మున్సిపల్ ఛైర్మన్ శ్రీనివాసరావు, తెదేపా నేతలు కొసరాజు వెంకటాద్రిచౌదరి, వల్లభనేని వెంకట్రావ్, తదితరులు పాల్గొన్నారు.

☛ పెంజెంద్ర, శేరిదగ్గుమిల్లి గ్రామాల్లోనూ కాల్వల వద్ద సర్పంచులు పద్మజ, రామతులసి, గ్రామస్థులు, తెదేపా నేతలు జలసిరికి హారతి కార్యక్రమాలు నిర్వహించారు.



బొమ్మలూరులో చెరువుకు జలహారతి ఇస్తున్న మహిళలు, నాయకులు

మంగళవారం 12 సెప్టెంబరు 2017

# రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు కౌతవరం విద్యార్థులు

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు ఎంపికయ్యారు. మచిలీపట్నం ఆంధ్ర జాతీయ కళాశాలలో ఈ నెల 8న జరిగిన ఎంపిక ప్రక్రియలో కావ్య, మొబీనా, హస్విత, హిమబిందు, భువనేశ్, రమేశ్, సాయికృష్ణ,



ఎంపికైన విద్యార్థులతో హెచ్‌ఎం కుమారి తదితరులు

నాగలక్ష్మి, లయ, మానస, హమీరా, రాజేశ్వరి, శ్రావణి, బిందు, ఉస్మాన్‌లు, వెయిట్‌లిఫ్టింగ్‌కు ఝాన్సీభవాని ఎంపికయ్యారు. వీరు త్వరలో నెల్లూరు, కర్నూలులో జరిగే పోటీలకు హాజరు కానున్నారు.

# కౌతవరంలో భారీ అన్నదానం

**కౌతవరం (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే:** మండలంలోని కౌతవరంలో మంగళవారం భారీ అన్నదానం చేశారు. స్థానిక విఘ్నేశ్వరాలయంలో పది రోజులుగా నిర్వహించిన గణపతి నవరాత్రుల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టారు. కౌతవరం, గుడ్లవల్లేరు, వేమవరం, పెసరమిల్లి, వెణుతురుమిల్లి గ్రామాలకు చెందిన దాదాపు అయిదు వేల మందికి అన్నప్రసాదాలు అందజేశారు. నిర్వాహకులు వల్లభనేని బాబూరావు, బి.నరసింహారావు, కొల్లి శేషారావు, మల్లి పెద్ది సుబ్రహ్మణ్యం తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

గురువారం 21 సెప్టెంబరు 2017

# పరిశుభ్రతతోనే ఆరోగ్యకర సమాజం



స్వచ్ఛతే సేవ చైతన్య ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులు

**గుడివాడ, న్యూస్‌టుడే :** అందరూ పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రత పాటిస్తే ఆరోగ్యవంతమైన సమాజం నిర్మించవచ్చని మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్వచ్ఛతే సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆంధ్ర నలంద మున్సిపల్ ఉన్నత పాఠశాలలో పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రత ఆవశ్యకత గురించి వివరించారు. అనంతరం విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కమిషనరు ఎన్. ప్రమోద్‌కుమార్, ప్రధానోపాధ్యాయురాలు పీవీలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**కౌతవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే :** మండలంలోని కౌతవరంలో బుధవారం స్వచ్ఛత కోసం ప్రదర్శనలు నిర్వహించారు. స్థానిక శ్రీ కానూరి దామోదరయ్య జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం విజయకుమారి ఆధ్వర్యంలో విద్యార్థులు ఎంఎన్‌కే రహదారిలో స్వచ్ఛత, పరిశుభ్రత, మరుగుదొడ్ల వినియోగంపై ప్లకార్డులు ప్రదర్శిస్తూ నినాదాలు చేశారు. అనంతరం ఎన్టీఆర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడిన విద్యార్థులతో స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం గత మూడు రోజులుగా నిర్వహించిన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. సర్పంచి పడమట సుజాత, తదితరులు పాల్గొన్నారు.




కౌతవరంలో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు



కోలాట ప్రదర్శనలో విద్యార్థినులు

**చినలింగాల(నందివాడ), న్యూస్‌టుడే :** ప్రతి ఒక్కరూ వ్యక్తిగత మరుగుదొడ్డి నిర్మించుకొని బహిరంగ మల, మూత్ర విసర్జనను పూర్తిగా నిర్మూలించాలని మండల విద్యాశాఖాధికారి గొరిపర్తి సుబాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. మండలంలోని చినలింగాల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు బహిరంగ మల, మూత్ర విసర్జనపై అవగాహనకు బుధవారం చిన, పెదలింగాల గ్రామాల్లో అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. గ్రామ ప్రధాన కూడళ్లలో కోలాట ప్రదర్శన ఇచ్చారు. హెచ్‌ఎం బుచ్చియ్య బాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




Jio
DIGITAL LIFE


Jio
DIGITAL LIFE


స్వచ్ఛతే సేవ


స్వచ్ఛతే సేవ


స్వచ్ఛతే సేవ